నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 27 జనవరి 2025 | ADILABAD NIRMAL



కుచులాపూర్ గ్రామ సభలో బీఆర్ఎస్; కాంగ్రెస్ నాయకులు నినాదాలు

# ప్రొటోకాల్ రగడ

### బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాట

బోథ్, జనవరి 26 : బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామసభలో ప్రొటోకాల్ రగడ నెలకున్నది. లబ్ధిదారులకు నాలుగు పథకాల పత్రాలు అందించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు. మధ్యాహ్నం ఒకటిన్నరకు సభ మొదలు కావాల్సి ఉండగా ఎమ్మెల్యే మరో గ్రామంలో కార్యక్రమానికి వెళ్లి రావడానికి కొంత ఆలస్యం అయింది. గ్రామసభకు వచ్చిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వచ్చే దాక ఎందుకు సమావేశాన్ని ప్రారంభించడం లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో బీఆర్ఎస్ శ్రేణులతో ఎమ్మెల్యే అక్కడి చేరుకున్నారు. ఎమ్మెల్యే రాకుండానే సమావేశాన్ని ఎలా ప్రారంభిస్తారని ప్రొటోకాల్ ఎందుకు పాటించడం లేదని బీఆర్ఎస్ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దశలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. సీఐ వెంకటేశ్వర్ రావ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, శిక్షణ ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఇరు వర్గాలను సముదాయించే ప్రయత్నం చేయగా తోపులాట జరిగింది. ఎమ్మెల్యే సభ ప్రాంగాణనికి చేరుకుని సంయమనం పాటించాలని, లబ్దిదారులకు పత్రాలు అందిచేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో రాజకీయాలు ఎందుకు అని సముదాయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వాజిద్ అలీ, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావ్, ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, వైస్ చైర్మన్ వసంత్‌రావ్, డైరెక్టర్లు రాజు యాదవ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



దివ్యాంగురాలికి ఇంటి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# 'ఆత్మీయ భరోసా' విధివిధానాలు మార్చాలి

### కాంగ్రెస్ నాయకులు

తాంసి(భీంపూర్), జనవరి 26 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మీయ భరోసా పథకం విధివిధానాలు మార్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బేల్సరి రాంపూర్‌లో ఆదివారం నిర్వహించిన గ్రామసభలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. 20 రోజుల ఉపాధి పని దినాల నిబంధనలతో భూమి లేని పేదలు లబ్ధి పొందలేకపోతున్నారని కాంగ్రెస్ నాయకులు దాసరి రమేశ్, కె.దేవారెడ్డి, అశోక్ పేర్కొన్నారు. అనారోగ్యంతో కనీసంగా 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లని వారు పథకం కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే ఉన్న ఫ్లెక్సీ కావాలి..**

బేల్సరి రాంపూర్‌లో పథకాల ప్రారంభ సభలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాత ఫొటో (కాంగ్రెస్ కండువాతో) ఉన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై మాజీ ఎంపీపీ సంతోష్, బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు కొత్త ఫ్లెక్సీ తెప్పించగా బీఆర్ఎస్ శ్రేణులు శాంతించారు.



ఆత్మీయ భరోసా నిబంధనలు మార్చాలంటున్న కాంగ్రెస్ నాయకుడు రమేశ్

# మాకెందుకు ఇయ్యరూ..

తాంసి, జనవరి 26 : తాంసి మండలంలోని హస్నాపూర్‌లో ఆదివారం నాలుగు పథకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనర్హులను ఎంపిక చేయడంపై లబ్ధిదారులు స్థానిక కమిటీ సభ్యులతో మాకెందుకు ఇయ్యలేదని వాగ్వాదానికి దిగారు. భూమి ఉన్న కుటుంబాలకు ఇచ్చారని, భూమిలేని కుటుంబాలను గాలికి వదిలేసారని ఆవేదన చెందారు. రానున్న రోజుల్లో ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఒక మాట సీఎం పీఠం ఎక్కిన తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. వెంటనే అర్హులైన వారికి సంక్షేమ పథకాల్లో చోటు కల్పించాలని లేకుంటే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హెచ్చరించారు.

**భూమిలేని కూలీలను పట్టించుకోరా?**



రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని నిరుపేద కూలీలకు రూ.12 వేలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇస్తామంటే సంబరపడ్డాం. ఇయ్యాల పంచిన కాగితాల్లో నా పేరు రాలే. అసలు భూములు లేని కూలీలను పట్టించుకోకుండా భూములు ఉన్న వాళ్ల పేర్లు అస్తున్నాయి. మాలాంటి భూమిలేని కూలీలను ఎవరు పట్టించుకుంటలేరు. ఇకనైనా మాలాంటోళ్లకు ఆత్మీయ భరోసా ఇయ్యాలి.

**- అన్నెల లత, మహిళా కూలీ, హస్నాపూర్.**



హస్నాపూర్ కమిటీ సభ్యులతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



# ఆవేదన ఆలకింపు

**ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల గోడు విన్న సభ్యులు**

మోసపోయి.. గోసపడుతున్నం..

- కాంగ్రెస్ పాలనలో విసుగు చెంది అఘాయిత్యాలకు పాల్పడవద్దు..
- అసెంబ్లీ, శాసనమండలిలో చర్చిస్తాం.. న్యాయం జరిగేలా చూస్తాం..
- కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా పోరాడుతాం..
- కౌలు రైతులను విస్మరించిన దగా కోరు కాంగ్రెస్ సర్కారు
- అన్నదాతల్లో ధైర్యం నింపిన రైతు అధ్యయన కమిటీ బృందం సభ్యులు

### అన్నదాతకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్



కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడం, రైతు భరోసా ఇవ్వక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నాం. దీనికి ఇటీవల జరుగుతున్న రైతు ఆత్మహత్యలే అద్దం పడుతున్నాయి. కేసీఆర్ పాలనలో అయితే సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోలేదు. గత శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ పర్యటించి ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాల్లో ధైర్యం నింపింది. అన్నదాతతోపాటు అన్ని వర్గాల ప్రజలు ఈ కాంగ్రెస్ పాలనలో విసిగిపోయారు. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలను ప్రారంభించడం, మిగతా గ్రామాలవారిని విస్మరించడం అయోమయానికి గురి చేస్తున్నది. ఇప్పటికైనా సర్కారు రైతు కూలీలకు న్యాయం చేయాలి.

*- గడ్డం లస్మన్న, రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం.*

**మహాలక్ష్మి సాయం ఎక్కడ?**

కమిటీ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో శనగ పంటలో పనిచేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. వారు తమ సమస్యలను సభ్యులకు ఏకరువు పెట్టారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం రూ.12 వేలు ఏడాది గడిచినా రావడం లేదని, మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ.2500 డబ్బులు రావడం లేదన్నారు. పింఛన్లను పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం మాట మరిచిందని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు అబద్ధాలు అని వారు సభ్యులకు సూచించారు.

### కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయాం..

రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ సభ్యులకు రైతులు ఏడాదికాలంలో పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి ఓటు వేశామని, ఇప్పుడు మోసపోవాల్సి వస్తున్నదని అన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం రెండు పంటలకు రాలేదని, దీంతో అప్పులు చేసి సాగు చేయాల్సి వస్తుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరుపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు రూ. 2 లక్షల రుణం అందడం లేదని, రేషన్‌కార్డు లేకున్నా, కుటుంబం మొత్తంలో రూ. 2 లక్షలకు రుణం ఉన్నవారికి ప్రభుత్వం మాఫీ చేయలేదని రైతులు తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికీ రూ. ఒక లక్ష బ్యాంక్ లోన్ రద్దు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరు రైతులకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేయాలని కోరారు. పంటల విక్రయాల్లో ఇబ్బందులు పడుతున్నామని, కష్టపడి సాగు చేసిన పంటలకు మద్దతు ధర లభించడం లేదన్నారు. పత్తి క్వింటాలుకు రూ.7,521 ఉండగా.. సీసీఐ రూ.100 తగ్గించి రూ.7,421 చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో సం తోషంగా ఉన్నామని, ఏడాది కాంగ్రెస్ పాలనలో వ్యవసాయరంగాన్ని ప్ర భుత్వాన్ని పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ బృందం పర్యటనలో రైతుల ధైన్యస్థితి వెలుగులోకి వచ్చింది.



**కౌలు రైతుకు సాయమేదీ?**

మిర్చి రైతు ఈశ్వర్‌తో మాట్లాడుతున్న అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి

ఆదిలాబాద్, జనవరి 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. 13 నెలలుగా రైతు సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోయి నా.. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తమ వద్దకు వచ్చి తమగోడును ఆలకించడంపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. చాలా రోజుల తర్వా త రైతు సమస్యల పరిష్కారానికి వేదిక దొరికిందని రైతులు అభిప్రాయపడ్డారు. కమిటీ పర్యటనలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగులో సమస్యలు బహిర్గతమయ్యాయి. పెట్టుబడి కోసం ఇబ్బందులు, బ్యాం కులు, ప్రైవేటు అప్పులు, బ్యాంకర్ల వేధింపులు, పంట నష్టం, అమ్మకాల్లో ఇబ్బందులను అధ్యయన కమిటీ బృందానికి తెలియజేశారు. కాంగ్రెస్ పాలనలో విసుగు చెందిన రైతులు ఆందోళనలు చెందవద్దని సభ్యులు సూచించారు. అన్నదాతల తరపున అసెంబ్లీ, శాసన మండలిలో తాము పోరాడుతామని, అఘాయిత్యాలకు పాల్పడవద్దని, న్యాయం కోసం పోరాడుతామని సూచించారు.

*ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులు ఆదిలాబాద్ రూరల్ మండలం, రామాయి యాపల్‌గూడ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. రామాయిలో మిర్చి సాగు చేస్తున్న రైతు ఈశ్వర్‌తో మాట్లాడారు. కౌలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సాయం అందుతుందని తాను ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నట్లు రైతు ఈశ్వర్ తెలిపారు. ఎకరాకు రూ. 31,600 చెల్లిస్తున్నారు. ప్రభుత్వం అందించే డబ్బుల్లో కొన్ని కలుపుకుని కౌలు డబ్బు లు చెల్లిద్దామనుకుంటే ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చిన హామీని మరిచిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి మోసపోయినట్లు తెలిపారు. దీంతో తాను అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా మిర్చి పంట క్వింటాలుకు రూ.28 వేల ధర రాగా, ఇప్పుడు కేవలం రూ.12 వేలు మాత్రమే వస్తున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం ఇస్తామన్న బోనస్ రూ.500 రావడం లేదని కమిటీ సభ్యులకు కౌలు రైతు ఈశ్వర్ వివరించారు.*

### దిగుబడి రాలే.. రుణమాఫీ కాలే..



మా కుటుంబానికి యాపల్‌గూడ శివారులో 4.10 ఎకరాల భూమి ఉన్నది. అందులో పత్తి, కంది వేస్తాం. ఈసారి దిగుబడి రాలేదు. ధరలు కూడా లేకుండే. ఇక మహారాష్ట్ర బ్యాంకులో మాకు ఉన్న రూ.2 లక్షల రుణం మాఫీ కాలేదు. ఇక కాంగ్రెస్ సర్కారు ఇస్తామన్న ఒక్క పథకం కూడా ఇవ్వలేదు. దీనితో ఈ పాలనతో విసుగు అనిపిస్తున్నది. అపుడు కేసీఆర్ సార్ ఉండంగ ఒక పథకం ఇస్తామంటే ఇచ్చేస్తుండె. ఇప్పుడు రైతు భరోసా కూడా ఇగో అగో అని కాలం జరుపుతున్నరు. నాకే కాదు మా గ్రామంల అందరూ కాంగ్రెస్ పాలనపై నారాజుగ ఉన్నరు. ఇక మొన్న బీఆర్ఎస్ అధ్యయన కమిటీ వారు అచ్చి మా అసుంటోళ్లకు మస్తు ధైర్యం చెప్పింండ్రు. **- నర్సింగు, రైతు, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం.**

### పథకాలు వస్తయనే నమ్మకం లేదు..



కేసీఆర్ సారు రెండు పంటలకు సమయానికి రైతుబంధు వేస్తుండే. అవి పెట్టుబడికి సరిపోతుండే. ఇపుడు రుణమాఫీ లేదు, రైతుభరోసాపై నమ్మకం లేదు. మా కుటుంబానికి మూడెకరాల భూమి ఉండగా.. మహారాష్ట్ర బ్యాంకుల రూ.2 లక్షల పంట రుణం ఉన్నది. గిప్పటికీ రుణ మాఫీ కాలే. మండలంలోని ఒక్క గ్రామంలనే పథకాలు మొదలు పెడితే.. ఇగ మిగిలిన గ్రామాల గతి ఎట్ల. మిగతా గ్రామాలకు అందుతాయనే నమ్మకం లేదు.

*- మామిళ్ల గంగారెడ్డి, యాపల్‌గూడ, ఆదిలాబాద్ మండలం.*



ఆదిలాబాద్‌లోని పోలీసు పరేడ్ మైదానంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

# సంక్షేమ పథకాల అమలు

### ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జనవరి 26(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో 18,741 కొత్త రేషన్‌కార్డులు, నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో నాలుగు విడుతలుగా 61,016 మంది రైతులకు రూ.685.42 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. సీసీఐ ద్వారా 23.85 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. గృహజ్యోతి పథకంలో 98,489 మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ఆర్‌వోఆర్-2024 చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, అధికారులు

# త్రివర్ణ పతాక రెపరెపలు

**నిర్మల్ జిల్లాలో కనుల పండువగా 'గణ'తంత్ర వేడుకలు**

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు.. శకటాలు..



జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 26 : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం వేడుకలు కనుల పండువగా కొనసాగాయి. కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని ఎస్పీ జానకి షర్మిలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. త్యాగధనుల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. అనేక ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి వివరించారు. పలు శాఖల శకటాలను ప్రదర్శించారు. పుర ప్రముఖులు పాల్గొనగా.. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందించిన వారికి, పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. అంతకుముందు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.




గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ